క్లుప్తంగా

ఇన్‌చార్జ్ కమిషనర్‌గా సీహెచ్ ఉపేందర్

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ డీఈగా పని చేస్తున్న సీహెచ్ ఉపేందర్‌కు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగిస్తూ అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్‌గా పని చేస్తున్న టి.ప్రసన్న రాణి తన వ్యక్తి గత పనుల నిమిత్తం ఈనెల 9 నుంచి 31వ తేదీ వరకు సెలవు పెట్టినట్లు అధికారులు తెలిపారు. పదిరోజులుగా ఫైళ్లు, బిల్లులు, సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉండి ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడ్డారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్

మహబూబాబాద్: కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టొప్పోను మానుకోట మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, డీఈ సీహెచ్ ఉపేందర్, ఏఈ సురేష్, కౌన్సిలర్లు మార్నెని వెంకన్న, చిట్యాల జనార్దన్, మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డొలాగర్ శంకర్, కర్పూరపు గోపి, రఘు, పర్యావరణ అధికారి క్రాంతి ఉన్నారు.

కరాటేలో గోల్డ్ మెడల్



కురవి/మహబూబాబాద్ అర్బన్: మండలంలోని రాజోలు శివారు హరిదాస్ తండా శివారు బాలు తండాకు చెందిన బాలుడు భూక్య భరత్‌నాయక్‌కు స్పారింగ్ కరాటే పోటీలో నేషనల్ గోల్డ్ మెడల్ సాధించినట్లు బాలుడి తండ్రి బాలునాయక్ సోమవారం తెలిపాడు. ఓరుగల్లు డ్రాగన్ స్కూల్ ఆఫ్ జపాన్ కరాటే షోటోకయ్ ఖాజీపేట ఆదివారం హన్మకొండలోని వాసవి కల్యాణ మండపంలో నిర్వహించిన థర్డ్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్–2023 జాతీయ స్థాయి పోటీల్లో బాలుడికి గోల్డ్ మెడల్ సాధించాడు. ఈబాలుడు మానుకోటలోని మహర్షి విద్యాలయంలో నాల్గో తరగతి చదువుతున్నాడు.

తహసీల్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీఓ

నెల్లికుదురు: స్థానిక తహసీల్ కార్యాలయాన్ని సోమవారం మహబూబాబాద్ ఆర్డీఓ అలివేలు సందర్శించారు. త్వరలో జరుగనున్న సర్పంచ్‌లు, ఎంపీ ఎన్నికలపై అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. మండలంలో నూతన ఓటర్లపై అవగాహన పెంచడంతోపాటు ఓటరు లిస్టును సవరించాలన్నారు. తహసీల్దార్ రాజు పాల్గొన్నాడు.

రూ.10వేలు వితరణ

కురవి: అయ్యప్పస్వామి మాలధారణ చేసిన భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ సోమవారం కురవికి చెందిన భక్తులకు ఆమె స్వగృహంలో రూ.10వేలను అందజేశారు. కార్యక్రమంలో బాదె నాగయ్య గురుస్వామి, వేమిశెట్టి సంతోష్, సంగెం నాగరాజు, కన్నె గురుమూర్తి, రాకేష్, ఐలి నరహరి పాల్గొన్నారు.

ఈ-కేవైసీ ఉచితంగా చేయాలి

తొర్రూరు: గ్యాస్ వినియోగదారులకు ఈ-కేవైసీ ఉచితంగా చేయాలని ప్రజాపంథా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. డివిజన్ కేంద్రంలో సోమవారం ప్రజాపంథా పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ డివిజన్ కార్యదర్శి వీరన్న, పుల్లయ్య, వెంకన్న, యాకయ్య, బీమా పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

గార్ల: 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్లు ఓటుహక్కు కోసం ఈనెల 31వ తేదీ లోపు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కె.స్వాతిబిందు తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు కొత్త ఓటు హక్కు కోసం మీసేవ కేంద్రాల్లో ఆధార్‌కార్డు, టెన్త్ మెమోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జనవరి 6వ తేదీన కొత్త ముసాయిదా ఓటర్ల జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల్లో విడుదల చేస్తామని పేర్కొన్నారు.

తల్లి, కుమారుడు అదృశ్యం



గార్ల: మండలంలోని సీతంపేట గ్రామంలో తల్లి, కుమారుడిపై అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న సోమవారం తెలిపాడు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని సీతంపేటకు చెందిన వంగాల పవన్, అరుణ 3ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. ఈనెల 16 వ తేదీన భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. భర్త ఇంట్లో లేని సమయంలో భార్య తన బాబును తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. భర్త బంధువుల ఇళ్లలో వెతికినా భార్య ఆచూకీ లభ్యం కాలేదు. భార్య కుమారుడు కనిపించడం లేదని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైతు సంక్షేమం కాంగ్రెస్ లక్ష్యం

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మహబూబాబాద్ రూరల్: ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: ప్రజలందరి దీవెనలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం లక్ష్యంగా ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అడవులను నమ్ముకుని జీవించే పోడు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. ప్రతి ఒక్కరిని కన్నబిడ్డల్లా కాపాడుకుంటుందని, రైతులు ఇబ్బందులు పడకుండా ఉండాలని స్థానికంగా గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రవీణ్, పీఏసీఎస్ సీఈఓ ప్రమోద్, ఏఈఓ శ్రీనివాస్, ఉపసర్పంచ్ చీరిక వేణు రెడ్డి, గ్రామ అధ్యక్షుడు చీరిక ఉపేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెల్లంకొండ శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ మొగిలి ప్రసాద్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఎమ్మెల్యే మురళీనాయక్‌ను మా అసోసియేషన్ అధ్యక్షుడు, కమలానగర్ లయన్స్ క్లబ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, లయన్ బొడ్డుపల్లి ఉపేంద్రం సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, రియల్ ఎస్టేట్ సంఘం నాయకులు దారోజి లక్ష్మణ్, ఉషోదయ వాకర్స్ సభ్యులు, తులసి గిఫ్ట్ సెంటర్ నిర్వాహకులు పరందామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సీపీఐ కృషి అభినందనీయం

నెహ్రూసెంటర్: శాసనసభ ఎన్నికల్లో మహబూబాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు సీపీఐ కృషి అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేను సీపీఐ నేతలు సోమవారం సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, నవీన్, వెంకన్న పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పెద్దవంగర: ఎంపికైన సౌజన్య



కేసముద్రం: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కేసముద్రం: ఆసిఫాబాద్‌లో ఈనెల 20 నుంచి 22 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకుగాను, ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టుకు కేసముద్రం విలేజ్ జెడ్పీహైస్కూల్‌కి చెందిన రామ్‌చరణ్, రాజేశ్వరి ఎంపికైనట్లు హెచ్‌ఎం కొత్త జగన్మోహన్‌రెడ్డి తెలిపాడు. ఈ మేరకు ఆ విద్యార్థులను సోమవారం ఉపాధ్యాయ బృందం అభినందించారు. పీఈటీ రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దవంగర: ఆసిఫాబాద్‌లో ఈనెల 20 నుంచి 22 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండల క్రీడాకారిణి సౌజన్య ఎంపికైనట్లు హెచ్‌ఎం కళాధర్, పీఈటీ సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అవుతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 8వ తరగతి చదువుతోంది. సర్పంచ్ సద్దెండి మంజుల సుధాకర్, ఎస్ఎంసీ చైర్మన్ ఎనగందుల సంతోష్, ఉపాధ్యాయులు అభినందించారు.

గుడిసెవాసులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

కురవి: పేదలు ఆక్రమించుకున్న భూమిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలందరికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పేదలు వేసుకున్న గుడిసెవాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయలేదని, ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కర్నం రాజన్న, కన్నె వెంకన్న, బూర్గుల కృష్ణ, వీరన్న, తాటికొండ బాబు, యేసుమణి, అచ్చమ్మ పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి



సభలో వివరాలు వెల్లడిస్తున్న డీఆర్పీ నర్సింహ

మరిపెడ రూరల్: ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని మహబూబాబాద్ జిల్లా రైతు సమన్వయ సభ్యులు జర్పుల కాలునాయక్ కూలీలకు సూచించారు. మండలంలోని బాల్యతండాలో ఉపాధి హామీపై సామాజిక తనిఖీ గ్రామసభను ఉపసర్పంచ్ గుగులోతు హరినాయక్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈసభకు ముఖ్యఅతిథిగా హాజరైన కాలునాయక్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ కింద రూ.46,53,759 కేటాయించగా, ఇందులో రూ.39,53,002 నిధులకు పనులు జరగడం హర్షనీయం అన్నారు. అనంతరం ఉపాధి హామీ డీఆర్పీ ఎం.నర్సింహ సభలో పలు వివరాలు వెల్లడించారు. బాల్యతండాలో 290 ఉపాధి హామీ జాబ్ కార్డులు కలిగి, 876 మంది కలిగి ఉన్నారన్నారు. ఓ మహిళా కూలీ 2017 మృతి చెందగా 2022లో ఆమె అకౌంట్‌లో రూ.666 జమ అయ్యాయని వెల్లడించారు. చేసిన పనులకు రికార్డులు పూర్తి స్థాయిలో లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుగులోతు హరినాయక్, కార్యదర్శి దశరథ, పీఏసీఎస్ డైరెక్టర్ బానోతు హరినాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ సోమనాయక్, టీఏ సంతోష్, బోడ వెంకన్న పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమం



మాట్లాడుతున్న విజయసారథి

నెహ్రూసెంటర్: పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఐ అనేక ఉద్యమాలు నిర్వహించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. సీపీఐ మహబూబాబాద్ నియోజకవర్గస్థాయి సమావేశం వరిపెల్లి వెంకన్న అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.విజయసారథి మాట్లాడుతూ. భారీ మెజారిటీ అందించిన ప్రజలకు అభివృద్ధి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందేలా ఎమ్మెల్యే మురళీనాయక్ కృషి చేయాలని సూచించారు. డిసెంబర్ 26వ తేదీన జరగనున్న సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మీ, పాండురంగాచారి, తండా సందీప్, చొప్పరి శేఖర్, మాలోత్ రవీందర్ పాల్గొన్నారు.

కనుల పండువగా వీరభద్రుడి కల్యాణం



వీరభద్రుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

కురవి: కురవిలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం సోమవారం హైదరాబాద్‌లోని కర్మాన్‌ఘాట్‌లోని ఏపీఆర్ ఫంక్షన్‌హాల్‌లో వీరభద్రస్వామి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో కనుల పండువగా జరిగింది. కురవి నుంచి భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఉత్సవమూర్తులను తీసుకెళ్లి కల్యాణం నిర్వహించారు. ఈకల్యాణ మహోత్సవంలో డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్‌లు మేకదామోదర్‌రెడ్డి, బాదావత్ రామునాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎర్ర నాగేశ్వర్‌రావు, ఎన్.రాజేందర్‌కుమార్, శ్రీ వీరభద్రస్వామి సేవా ట్రస్టు బాధ్యులు కాసుల వినోద్, అనసూయమ్మ, షాబాది వెంకటేషం, శంకర్, వెంకటేషం, కోడూరి వినోద్, కిరణ్ పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ముందుకు సాగుదాం



మాట్లాడుతున్న సీడీపీఓ నీలోఫర్ అజ్మీ

గూడూరు: మహిళలు వివక్షతకు గురికాకుండా వారి రక్షణ కోసం మహిళా లోకం ముందుకు సాగాలని ఐసీడీఎస్ సీడీపీఓ నీలోఫర్ అజ్మీ అన్నారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం కొత్తగూడ, గంగారం, గూడూరు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో – బేటీ పడావో పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణలో, పోషకాహారం అందించడంలో అంగన్‌వాడీ పాత్ర ముఖ్యమైందని అన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు అరుణ, సంధ్యారాణి, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి



ఆందోళన చేస్తున్న జేఏసీ ప్రతినిధులు

తొర్రూరు: మండల శివారులోని డీబీఎం 59 కెనాల్ స్థలంలో అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట నాయకులు బందు మహేందర్, ఆప్ విద్యార్థి విభాగం రాష్ట అధ్యక్షుడు మాలోతు సురేష్‌బాబు డిమాండ్ చేశారు. స్థలం ఆక్రమించిన వారిపై చర్య తీసుకోవాలని సోమవారం మండల శివారులో విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా మహేందర్, సురేష్‌బాబులు మాట్లాడుతూ.. కెనాల్ స్థలం కుడివైపున 44ఫీట్లు ఉండాల్సి ఉండగా 24ఫీట్లకే పరిమితమైందన్నారు. గత ప్రభుత్వంలో నాటి మంత్రి దయాకర్‌రావు అనుచరులు భూమి కబ్జా చేశారని ఆరోపించారు. ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఆందోళన స్థలికి చేరుకుని చెదరగొట్టారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ రాష్ట కమిటీ సభ్యుడు గంగాధరి సిద్ధు, నాయకులు బందు వెంకన్న, యాసారపు మల్లేష్, యాకయ్య, సాయి కిరణ్, హరీశ్, గణేష్, ప్రణయ్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు

గూడూరు: మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను సోమవారం మండల ఆదివాసీ నాయకుల తోపాటు గూడూరు ఉప సర్పంచ్ శివరాత్రి సంపత్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పడిగె నాగేశ్వర్‌రావు, ఈసం సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వీల్‌చైర్ అందజేత

కురవి: హైదరాబాద్‌కు చెందిన హోప్‌స్టెప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీరోలు మండల కేంద్రానికి చెందిన అంగోత్ ప్రత్యూష అనే దివ్యాంగురాలికి కురవిలోని శ్రీవీరభద్రస్వామి ఆలయంలో వీల్‌చైర్‌ను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు నాగవెల్లి శ్రీనివాస్, సభ్యులు గండమల్ల అశోక్, దుగ్గి రమేష్, కుర్రె శ్రీనివాస్, ఎల్లావుల భునేష్, విక్రమ్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు భౌతికకాయం అప్పగింత



నెహ్రూసెంటర్: స్వాతంత్ర్య సమరయోధుడు పోతుగంటి రామస్వామి భౌతికకాయాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నేత్ర, అవయవదాన దాతల అసోసియేషన్ జిల్లా కన్వీనర్ రవీందర్‌రెడ్డి, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.మౌనిక, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇంట్లో సామగ్రి దగ్ధం

నెల్లికుదురు: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో సోమవారం చీకటి ఐలమ్మ ఇంట్లో దేవుడి పటం వద్ద దీపం పెట్టి ఓ మహిళ కూలి పనికి వెళ్లింది. ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంట్లో సామగ్రి దగ్ధం అయింది. ఇంట్లోని రూ.20వేల నగదు తోపాటు సామగ్రి కాలిపోయిందని తెలిపారు. రూ.లక్ష విలువ చేసే ఆస్తినష్టం వాటిల్లిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.

కుష్టు నిర్మూలనకు కృషి చేయాలి

తొర్రూరు: కుష్టు వ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని డీపీఎంఓ చెప్యాల వనాకర్‌రెడ్డి అన్నారు. జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పలువురు బాధితులకు సెల్ఫ్ కేర్ కిట్లు పంపిణీ చేశారు.

బూత్ అధికారులకు శిక్షణ

బయ్యారం: ఓటర్ల నమోదు, మార్పులపై సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని బూత్‌స్థాయి అధికారులకు శిక్షణా కార్యక్రమంను నిర్వహించారు. తహసీల్దార్ ఇమ్మానుయల్, ఎంపీడీఓ నారాయణరెడ్డి బూత్ అధికారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

పాత పెన్షన్ కోసం ఉద్యమిస్తాం..

మరిపెడ: పాత పెన్షన్ కోసం ఉద్యమిస్తామని రిటైర్డ్ ఉద్యోగుల పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట ప్రధాన కార్యదర్శి టి.సీతారాం అన్నారు. మరిపెడలో సోమవారం పెన్షనర్స్ పితామహుడు నకరా జయంతి సందర్భంగా పెన్షనర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏటీఓ నవీన్‌కుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీపీ అరుణ, పెన్షనర్లు రామ్మూర్తి, వెంకటరెడ్డి, రాములమ్మ పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలను పెంచాలి

కేసముద్రం: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీ, కూలీ, దడువాయి కార్మికుల వేతనాలను పెంచాలని ఐఎఫ్‌టీయూ రాష్ట నాయకుడు శ్రీధర్ డిమాండ్ చేశారు. సోమవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో కార్యదర్శి రాజేంద్రప్రసాద్, మార్కెట్ చైర్ పర్సన్ నీలంసుహాసినిదుర్గేష్‌కు యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ అందించారు.

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామంలో గల శ్రీకోదండ రామాలయం ఆవరణలో శ్రీవల్లి, దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్య స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జి.అనిల్ కిరణ్ కుమార్, జ్యోత్స్నదంపతులు హాజరై శాంతియజ్ఞం పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాంశెట్టి వీరేందర్, ప్రధాన కార్యదర్శి పద్మం ఉపేంద్రమ్మ, ఉపాధ్యక్షుడు భిక్షపతి, యమున, కోశాధికారి శ్రీను, మున్సిపల్ చైర్మన్ రామ్మోహనరెడ్డి, కౌన్సిలర్లు హరిసింగ్, వెంకన్న పాల్గొన్నారు.

స్థల విక్రయాలకు అనుమతిలేదు

మహబూబాబాద్ రూరల్: డబ్బులు కట్టించుకున్నారు.. చెల్లించడంలేదంటూ మండలంలోని ఆమనగల్ గ్రామ శివారులో మహర్ష డెవలపర్స్ ఏజెంట్లు, డబ్బులు కట్టిన బాధితులు ఆదివారం ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన సంబంధిత అధికారులు సదరు భూమి ఉన్నచోట ఆ స్థలానికి ఎలాంటి అనుమతి లేదని, ప్లాట్లు చేసి విక్రయించొద్దని సోమవారం గమనిక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

ఎనిమిదిన్నర నెలలు.. 85 ఫోన్ల రికవరీ



మహబూబాబాద్ రూరల్: మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నవారికి అండగా నిలుస్తున్నారు మహబూబాబాద్ టౌన్ పోలీసులు.. ఈఏడాది మార్చి ఒకటో తేదీన మొదలైన సీఈఐఆర్ యాప్ ద్వారా మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు తమవంతు సహకారం అందిస్తున్నారు. ఎనిమిదిన్నర నెలల్లో 85 ఫోన్ల ఆచూకీ కనుగొని రికవరీ చేసి ఫోన్లు పోగొట్టుకున్నవారికి అప్పగించారు. ఎవరికైనా సరే ఫోన్ దొరికినప్పుడు వారి సమీప పోలీసుస్టేషన్‌లో అప్పగించి బాధితుల మన్ననలు పొందాలని టౌన్ సీఐ వై.సతీష్ సూచించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మరిపెడ రూరల్/తొర్రూరు/నర్సింహులపేట: రేపు 20వ తారీకు బుధవారం రోజున ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మరిపెడ, దంతాలపల్లి, నర్సింహులపేట, తొర్రూరు మండలాల్లో విద్యుత్ అంతరాయం ఉన్నట్లు తొర్రూర్ డీఈ మధుసూదన్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



గార్ల: అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గార్ల: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గార్ల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు బాలికలు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం డి.కోటేశ్వరి సోమవారం తెలిపారు. ఇటీవల కురవిలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్–17 విభాగంలో 10వ తరగతి చదువుతున్న జి.పూజిత, అండర్–14 విభాగంలో 7వ తరగతి చదువుతున్న టి.జమున అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థినులను పాఠశాల పీడీ పద్మ, పీఈటీ సుశీల, ఉపాధ్యాయులు అభినందించారు.

కారు పల్టీ.. ముగ్గురికి గాయాలు

మరిపెడ రూరల్: ఓ కారు ముందు టైరు పేలిపోయి అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వివరాలు మండలంలోని తండధర్మారం స్టేజి సమీపంలోని మహబూబాబాద్–సూర్యాపేట 365 జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా బయ్యారం మండల కేంద్రానికి చెందిన కొదుమూరి వెంకటేశ్వర్లు, భార్య ఆదిలక్ష్మి, కుమారుడు విజయ్ ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు కలిసి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి కారులో వెళ్తున్నారు. మండలంలోని తండాధర్మారం స్టేజివద్ద కారు అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈసంఘటనలో ముగ్గురు కూడా స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం స్వల్పగాయాలైన వారిని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సురేందర్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే

మరిపెడ రూరల్: మాజీ పార్లమెంట్ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామసహాయం సురేందర్‌రెడ్డిని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రు నాయక్ హైదరాబాద్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా తన గెలుపునకు కృషి చేసిన సురేందర్ రెడ్డికి శాలువాతో అభినందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు.

కోదండరాంకు అభినందనలు



గార్ల: రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించి ఖమ్మంకు తొలిసారి వచ్చిన టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను సోమవారం గార్లకు చెందిన టీజేఎస్ రాష్ట నాయకులు గిన్నారపు మురళి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపాడు.